పెంచిన వేతనాలకు బడ్జెట్ ఇవ్వకపోతే

పాఠశాలల్లో 'వంట బంద్'

- ప్రగతిభవన్‌నూ ముట్టడిస్తాం
- ధర్నాచౌక్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల భారీ ధర్నా
- రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది రాక
- మీ జీతాలు పెంచుకుంటారు.. కార్మికులు సంగతేంటి ?
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆగ్రహం
- నినాదాలతో దద్దరిల్లిన ధర్నాచౌక్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెంచిన వేతనాలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి వెంటనే నిధులివ్వకపోతే ప్రభుత్వ పాఠశాలల్లో వంటను బంద్ చేస్తామని మధ్యాహ్న భోజన కార్మికులు హెచ్చరించారు. అవసరమైతే ప్రగతిభవన్‌నూ ముట్టడిస్తామని ప్రకటించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో నిర్వహించిన ఆందోళన ద్వారా అల్టిమేటమ్ ఇచ్చారు. ఏండ్ల తరబడి తమ కష్టాలు, బాధలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా హాజరయ్యారు. దాదాపు అన్ని జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌కు చేరుకున్నారు. ధర్నా కోసం మంగళవారం రాత్రే హైదరాబాద్‌కు వచ్చారు. బస్సులు, లారీలు, ఇతర వాహనాల్లో తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన ధర్నా సాయంత్రం నాలుగు గంటల వరకు సాగింది. ధర్నా ప్రాంగణంతోపాటు చుటుపక్కల మొత్తం మధ్యాహ్న భోజనం కార్మికులతో ఇందిరాపార్క్ నిండిపోయింది. ఎక్కడా చూసినా వారే కనిపించారు. పిల్లలను ఎత్తుకుని ఆందోళనలో పాల్గొన్నారు. సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్మికుల నినాదాలతో ధర్నాచౌక్ దద్దరిల్లింది. పెంచిన వేతనాలకు బడ్జెట్ ఇవ్వాలి, మెనూ ఛార్జీలను చెల్లించాలి అంటూ నినాదాలు చేశారు. సిఎం హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ర

విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఇచ్చిన మాట కూడా నిలబెట్టుకోలేదని ధర్నా సందర్భంగా కార్మికులు వ్యాఖ్యానించడం గమనార్హం. నినాదాలతోపాటు ప్లకార్డులు ప్రదర్శించారు. జెండాలను పట్టుకుని ఒక పూట సాంతం ఆందోళనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంఘం ఉపాధ్యక్షులు సుల్తానా అధ్యత వహించగా, సిఐటియు ఉపాధ్యక్షులు ఈశ్వర్‌రావు, యూనియన్ ఆఫీసు బేరర్లు ఇందూరి సులోచన, రాజేశ్వరి, మాయ, సరస్వతి, స్వప్న, సత్యనారాయణ, సిఐటియు నాయకులు గోపర్థన్, రంజిత్, కృష్ణామాచారి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీ అమలుచేయాలి: పాలడుగు భాస్కర్

మధ్యాహ్న భోజన కార్మికులకు అసెంబ్లీ సాక్షిగా సిఎం ఇచ్చిన హామీలు అమలుచేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ధర్నాను ప్రారంభించి మాట్లాడిన ఆయన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ జీతాలు పెంచుకుంటే సరిపోదనీ, పిల్లల కడుపులు నింపుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల బతుకుల్లోకి తొంగిచూడాలని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాగితాల్లో కాకుండా ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు.

సమస్యలపై ప్రభుత్వాలు హామీలు ఇస్తూ కాలం గడుపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు అప్రమత్తంగా ఉంటూ అడుగడుగునా పోరాటం చేయాల్సిందేనని చెప్పారు. కనీస పౌష్టికాహారం లేక కార్మికుల ఆరోగ్యం దెబ్బతింటుందని గుర్తు చేశారు. ఏరియర్లతో కలుపుకుని వేతనాలు చెల్లించాలని సర్కారుకు విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ధర్నాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుతం 24 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు కోడ్‌లు తెచ్చిందని విమర్శించారు. సిఎం కెసిఆర్ స్కీం వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోలీసు, మిలిటరీ, లారీఛార్జీకి బెదిరేదిలేదని చెప్పారు.

15 రోజుల్లో పరిష్కరించాలని :జె.వెంకటేశ్

మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలను 15 రోజుల్లో యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. వారి న్యాయసమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఎర్ర జెండాలు స్వార్థ రాజకీయాలు చేయవనీ, ప్రజాసమస్యలపై పోరాటాలు మాత్రమే చేస్తామని అన్నారు. మంత్రి హరీశ్‌రావు ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన అవాకులు, చేవాకులు పేలుతున్నారని విమర్శించారు. కెసిఆర్ నీకు రోజులు దగ్గరపడ్డాయని అన్నారు.

బంగారు తెలంగాణలో ఆడపడుచుల కంటనీరు:ఎస్‌వి రమ

తెలంగాణలో ఆడపడుచుల కంటనీరు ప్రవహిస్తున్నదని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.వి రమ డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం కార్మికుల వేతనాలు పెంచడం లేదన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించక అప్పుల పాలవుతున్నారని గుర్తు చేశారు. అధికారంపై ఉన్న మక్కువ ప్రజలు, కార్మికులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీని ఎత్తేసింది, ఇప్పుడేమో కట్టెలపొయ్యిపై వంట చేయకుండా అడ్డుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు పెట్టుబడి పెట్టినా లాభం లేదన్నారు.

బిల్లులివ్వలేరు

బి.అరుణ, మహబూబ్‌నగర్

ఎనిమది నెలల నుంచి బిల్లులివ్వలేరు. నెలకు రూ. 30 నుంచి రూ.35 వేలు రావాలి. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకుంటలేరు. పెంచిన జీతం కూడా ఇయ్యట్లేదు. బ్యాంకు ఖాతా చూస్తున్నం. పైసలైతే ఇస్తలేరు.

తొమ్మిది నెలలైంది జీతంలేక

పి. సునిత, కేశంపేట

నాకు జీతం రాక తొమ్మిది నెలలు అయింది. నెలకు రూ. 1000 నుంచి రూ. 3000కు పెంచిర్రు. పెంచిన జీతం లేదు. పాత జీతం లేదు. ఏదీ లేదు. బియ్యం తప్ప ఏమీమిస్తలేరు. అన్నీ మేమే తెచ్చుకోవాలే.

దున్నేసిన పంటను చూసి ఏం రిపోర్టు ఇస్తారు?

- వ్యవసాయ శాస్త్రవేత్తలకు ఉప్పూర్ రైతుల సూటి ప్రశ్న
- అధికారులపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దున్నేసిన పంటను చూసి ఇప్పుడు ఏం రిపోర్టు ఇస్తారని వ్యవసాయ శాస్త్రవేత్తలను ఉప్పూర్ రైతులు సూటిగా ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్పూర్‌లో గ్రామంలో నకిలీ విత్తనాలతో, వర్షాలతో దెబ్బతిన్న సోయాపంటను పరిశీలించేందుకు శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించారు. కాగా, అప్పటికే గ్రామంలో అనేక మంది రైతులు సోయా పంట పూత, కాత రాకపోవడంతో దున్నేశారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్టు అధికారులు ఇప్పుడొచ్చి పంటలను పరిశీలించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో అందరూ రైతులు ఖరీఫ్ మెట్ట పంటగా సోయాబీన్ పంటను సాగు చేశారు. సోయాబీన్ పంటలో కొన్ని రకాలు పూత, కాత మొత్తం రాలేదు. కొన్ని రకాలు మంచి పంట వచ్చింది. ఈ పంట రాని విత్తనాలు రైతులను ప్రతేడాది నిండా ముంచుతున్నాయని కొద్ది రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్నారు. అందులో భాగంగా వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త బాలాజీ నాయక్, రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అంజయ్య, శాస్త్రవేత్తలు విజయ్ కుమార్, దినేష్‌నం భింగల్ ఏడీఏ మల్లయ్య బుధవారం గ్రామానికి తీసుకొచ్చారు. అయితే ఇప్పటికే పూర్తిగా నష్టపోయిన రైతులు సోయా పంటను దున్నేశారు. దున్నేసిన పంటను శాస్త్రవేత్తలు, అధికారులు వచ్చి పరిశీలించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దున్నేసిన పంటను ఇప్పుడు వచ్చి ఏమని రిపోర్టు ఇస్తారని ప్రశ్నించారు. రైతులను నిండా ముంచుతున్న నకిలీ విత్తన కంపెనీలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని శాస్త్రవేత్తలను, అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

రేపే టెట్

- సర్వంసిద్ధం చేసిన విద్యాశాఖ
- పరీక్ష జరిగే స్కూళ్లు, కాలేజీలకు నేడు, రేపు సెలవు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్ష జరగనుంది. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు సర్వంసిద్ధం చేశారు. ఈ మేరకు ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్‌కు 4,78,055 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. వారి కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,052 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఇందులో పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారికోసం 1,139 పరీక్షా కేంద్రాలు, పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారి కోసం 913 పరీక్షా కేంద్రాలున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోనూ నిర్వహిస్తామని వివరించారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం 2,052 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 2,052 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 22,572 మంది ఇన్విజిలేటర్లు, 10,260 మంది హాల్ సూపరింటెండెంట్లను నియమించామని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, డిఇఒలు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సిసి కెమెరాల ఏర్పాటు, అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా వంటి చర్యలు తీసుకున్నారని వివరించారు. వైద్యారోగ్య శాఖ పరీక్షా కేంద్రాల వద్ద ఎఎన్‌ఎంలను మెడికల్ కిట్లతో అందుబాటులో ఉంచిందని తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలున్న ప్రాంతాలకు అభ్యర్థులు సకాలంలో వెళ్లేందుకు ఆర్‌టిసి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఉంటుందని వివరించారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహిం చేందుకు జిల్లా స్థాయి పరిశీలకులను నియమించామని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. రెండు బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నులు, హాల్‌టికెట్ వెంటతెచ్చుకోవాలని కోరారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, బ్యాగులను అనుమతించబోమని స్పష్టం చేశారు.

ఆ విద్యాసంస్థలకు నేడు, రేపు సెలవు

టెట్ పరీక్షా కేంద్రాలున్న పాఠశాలలు, కాలేజీలకు గురు, శుక్రవారం రెండు రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. టెట్ నిర్వహించే విద్యా సంస్థలకు రెండురోజులు సెలవులిస్తున్నట్టు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే గురువారం మధ్యాహ్నం, శుక్రవారం రెండు పూటలా సెలవులుంటాయని స్పష్టం చేశారు. టెట్ నిర్వహించే జూనియర్ కాలేజీలకు గురు, శుక్రవారాల్లో సెలవులుంటా యని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే గురు వారం మధ్యాహ్నం, శుక్రవారం రెండుపూటలా సెలవులుంటాయని పేర్కొన్నారు.

టెట్ పరీక్ష వివరాలు

టెట్ నిర్వహణ తేదీ	దరఖాస్తులు	పరీక్షా కేంద్రాలు
పేపర్-1	2,69,557	1,139
2023, సెప్టెంబర్ 15 పేపర్-2	2,08,498	913
మొత్తం	**4,78,055**	**2,052**

బంగాళాఖాతంలో అల్పపీడనం

మూడ్రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతున్నది. రాబోయే 24 గంటల్లో ఇది కాస్తా మరింత బలపడి దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా మరింత చురుగ్గా కదిలే అవకాశముంది. రాబోయే మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. అదే సమయంలో రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. పలు జిల్లాలో భారీ వర్షాలు పడే సూచనలు కనిపిస్తుండటంతో కొమ్రంభీం అసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికను జారీ చేసింది.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరి చెప్పాలి : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరి చెప్పాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని చల్‌గల్ మ్యాంగో మార్కెట్‌లో బుధవారం బిఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు కవిత, ఎల్.రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కీలకమైన అంశాలపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల కోసం రెండ్రోజుల్లో మొత్తం గాంధీ పరివారం తెలంగాణకు వస్తుంది. తెలంగాణ డిక్లరేషన్ల పేరిట ఇస్తున్న హామీలను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా.. తెలంగాణలో జరుగుతున్న అబివృద్ధి, సంక్షేమ పనులను సోనియాగాంధీ, రాహుల్ గాంధీ కలలోనైనా ఊహించగలరా" అని ప్రశ్నించారు. ముందు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పి తెలంగాణకు రావాలన్నారు. రాహుల్‌గాంధీ అప్‌డేట్స్ లేని అవుట్ డేటెడ్ నాయకుడని విమర్శించారు. రాహుల్‌గాంధీకి ఆలోచన లేదని, సిఎం కెసిఆర్ వేగాన్ని రాహుల్ గాంధీ అందుకోలేరని అన్నారు. కేంద్రంలో ప్రధాన మంత్రి మోడీని రాహుల్ గాంధీ ఆపలేకపోతున్నారని, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను గత ఎన్నికల్లో కంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

'జమిలి' పేరుతో ప్రజల్లో గందరగోళానికి యత్నం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తోంది.. షెడ్యూల్ ప్రకారం ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించాలి కానీ జమిలి ఎన్నికలు, మినీ జమిలి ఎన్నికలంటూ.. అన్ని రాజకీయ పార్టీలను.. ప్రజలను గందరగోళంలోకి నెట్టేందుకు యత్నిస్తోంది' అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్ కోసం తెలంగాణ ప్రజలు కెసిఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో ప్రయారిటీ లేదని పరేషాన్‌లో ఉన్న నేతలు కెసిఆర్, కెటిఆర్‌పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మతిస్థిమితం, స్థిరత్వం లేని వ్యక్తి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అని, ఆయన ఎప్పుడు ఏం మాట్లాడుతారో ఆయనకే తెలియదని విమర్శించారు. కెటిఆర్ కృషి వల్ల అన్ని స్థానాల్లో బిఆర్ఎస్ పార్టీనే గెలవబోతుందని జోస్యం చెప్పారు. బిఆర్ఎస్‌లో తెలంగాణ వ్యతిరేకులు ఉన్నారంటున్న కోమటిరెడ్డి.. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వైఎస్ షర్మిలను ఎందుకు కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమానికి బద్ధవ్యతిరేకులు, రాష్ట్రం ఏర్పాటును వ్యతిరేకించిన వారు, ఎందరో ఆత్మబలిదానాలకు కారకులైన వారు నేటికీ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారని చెప్పారు. ఈనెల 17న జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు.

గణేష్ నవరాత్రులకు భారీ బందోబస్తు

- హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసులు అప్రమత్తం
- జిహెచ్ఎంసి, రెవెన్యు, విద్యుత్, జలమండలి అధికారులతో సమావేశాలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

గణేష్ నవరాత్రుల నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈనెల 18 నవరాత్రులు ప్రారంభం కానుండటంతో అందుకు కావాల్సిన ఏర్పాట్లు, భద్రతతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులు దృష్టి సారించారు. గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించినప్పటి నుంచి నవరాత్రుల పూజలతో నగరంలో సందడి వాతావరణం ఏర్పడుతుంది. మూడు కమిషనరేట్ల పరిధిలో దాదాపు 60వేలకుపైగా విగ్రహాలను ప్రతిష్ఠించే అవకాశముందని అధికారుల అంచనా. గణేష్ పండుగ ప్రారంభం నుంచి నిమజ్జనం ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను పూర్తి చేసేవిధంగా చర్యలు చేపడుతున్నారు.

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పాత నేరస్థులు, రౌడీ షీటర్ల కదలికలపై ఆరా తీస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ఎప్పటికప్పుడూ సమాచారం సేకరిస్తున్నారు. దేవాలయాల నిర్వాహకులు, మండపాలను ఏర్పాటు చేయనున్న వారికి పోలీస్ అధికారులు ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేయనున్నారు. భద్రతలో భాగంగా నగరంలో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మహిళల భద్రత, ఆకతాయిల ఆటకట్టించేందుకు షీ బృందాలను రంగంలోకి దించుతున్నారు. ట్రాఫిక్, సివిల్, టాస్క్‌ఫోర్సు, ఎస్ఒటీ, ర్యాపిడ్ యాక్షన్ పోలీసులతోపాటు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించనున్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్, రెవెన్యుతోపాటు తదితర శాఖల అధికారులతో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రాలు కో-ఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించారు. గణేష్ ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సి చర్యలపై పలు దఫాలుగా చర్చించి దిశా, నిర్దేశం చేశారు.

గతి డెలివరీ సామర్థ్యం పెంపు

ముంబయి : ప్రముఖ సరుకు సరఫరాదారు అయినా గతి ఎక్స్‌ప్రెస్ ప్రస్తుత పండగ సీజన్‌లో డిమాండ్‌ను తట్టుకోవడానికి సామర్థ్యం పెంచుకున్నట్లు ప్రకటించింది. పండుగ సీజన్‌లో వైట్ గూడ్స్, వినియోగదారుల ఉత్పత్తులు, ఇతర సరుకుల రవాణ డిమాండ్ పెరుగుతుందని.. దీన్ని తట్టుకోవడానికి సన్నద్ధం అయినట్లు పేర్కొంది. సంవత్సరంలో ఎప్పుడైనా 20 శాతం ఎక్కువ కార్గో లోడ్‌లను నిర్వహించగలమని గతి లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ గౌరీనాథ్ పేర్కొన్నారు. తమ సంస్థ 180 దేశాలలో నెట్‌వర్క్ కలిగి ఉందన్నారు. భారత్‌లోని 735 జిల్లాల్లో 19,800 పిన్‌కోడ్‌లకు డెలివరీ చేయగలమన్నారు.

నిధుల సమీకరణలో రిలయన్స్ రిటైల్

న్యూఢిల్లీ : ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ రిటైల్ కొత్తగా 1.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.12,400) నిధులు సమీకరించడానికి చర్చలు జరుపుతోందని సమాచారం. ఇందుకోసం ప్రస్తుత తమ ఇన్వెస్టర్లతోనే సంప్రదింపులు చేస్తోందని రిపోర్టులు వస్తోన్నాయి. సింగపూర్, అబీదాబి, సౌదీ అరెబియా తదితర ప్రాంతాల్లోని సంస్థల నుంచి నిధుల సమీకరణలో ఉందని సమాచారం. ప్రస్తుత సెప్టెంబర్ ముగింపు నాటికి 3.5 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించాలని నిర్దేశించుకోగా.. ఇప్పటికే ఒక బిలియన్ డాలర్లు సమకూర్చుకుంది.

గుడిసెవాసుల పోరు తీవ్రం

- ఎర్రజెండా చేతబూని ఏకమైన వందలాది పేదలు : వీరయ్య
- ములుగు 'వాజేడు'లో కొనసాగుతున్న ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా వాజేడు మండలం పూసురు గ్రామంలో గుడిసెవాసుల పోరాటం తీవ్రమవుతోంది. గుడిసెవాసుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మూడ్రోజులుగా ఈ పోరాటం కొనసాగుతోంది. ఎర్రజెండా చేతబూని వందలాది పేదలు ఆ ప్రాంతంలో ఏకమయ్యారు. నినాదాలు, పాటలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. బుధవారం తెలంగాణ ప్రజాసంఘాల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ 'పేదలకు ఇవ్వాల్సిన ఇంటి స్థలాలకు స్థలం లేదు.. కార్పొరేట్లకు మాత్రం బిఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా భూములు కేటాయిస్తోంది' అని విమర్శించారు. 'రాష్ట్ర వ్యాపితంగా 65 కేంద్రాలలో భూపోరాటం జరుగుతోంది.. మీకు అండగా వేలాది మంది గుడిసె వాసుల మద్దతు ఉంది. మీరు ఒంటరి వాళ్లు కాదు' అని పేదలకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వ స్థలం పేదోడికి ఇవ్వలేకుంటే ఆ భూమి

ఎందుకని ప్రశ్నించారు. పోరాడితే పోయేదేమి లేదని, పోరాటం చేసేవారికి ఎర్రజెండా ఉంటుందని అన్నారు. పేదల బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, కానీ కల్లబొల్లి మాటలతో కాలం వెల్లదీయడం సరికాదన్నారు. వాజేడు మండలంలో వేయి మంది పేదలు గుడిసెలు వేసుకున్నారంటే.. ఇంటి స్థలాలు సమస్య ఎంత ఉందో అర్థం అవుతుందని అని అన్నారు. గుడిసెలు తొలగించాలని ఆలోచన చేస్తే ఊరుకోబోమని, రాష్ట్ర వ్యాపిత ఉద్యమంగా మలుస్తామని అధికారులను హెచ్చరించారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, మల్లు స్వరాజ్యం, పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, బీరెడ్డి సాంబశివా, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, జిల్లా కమిటి సభ్యులు గ్యానం వాసు, కృష్ణబాబు దేవయ్య, సౌమ్య దామోదర్, కృష్ణబాబు, సంతోష్, కుమారి ముత్తయ్య బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రిని పునర్ నిర్మించాలి

- డాక్టర్ల డిమాండ్లను నెరవేర్చాలి
- మహాధర్నాలో ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు
- త్వరలో వైద్యగర్జన నిర్వహిస్తామని హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిని పునర్ నిర్మించాలని ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన మహాధర్నాలో సంఘం నాయకులు డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్ తదితరులు మాట్లాడారు. ఉస్మానియా ఆస్పత్రిని ట్విన్ టవర్స్‌గా నిర్మిస్తామని సిఎం కెసిఆర్ గతంలో మాటిచ్చారని గుర్తుచేశారు. అయితే కోర్టు కేసులున్నాయనే సాకుతో కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాన్ని నిర్మించి, నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పనుల్ని ప్రారంభించిన ప్రభుత్వానికి ఉస్మానియా నిర్మాణం ఎందుకు సాధ్యం కాదని వారు ప్రశ్నించారు. గతంలో ఎంఐఎం పార్టీ అడ్డుపడుతుందనీ సాకులు చెప్పారనీ, అయితే ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసి స్వయంగా ఉస్మానియా ఆస్పత్రిని సందర్శించి పునర్ నిర్మాణానికి అభ్యంతరం లేదని ప్రకటించిన విషయాన్ని నాయకులు గుర్తుచేశారు. డిఎంఇ పరిధిలో పని చేసే వైద్యులకు పిఆర్‌సి ఎరియర్స్ బకాయిలు విడుదల చేయాలనీ, జీఒ నెంబర్ 142 రద్దు చేస్తూ డిప్యూటీ డిఎంహెచ్ఒ పోస్టులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో చేసినట్టుగా టివివిపిని ప్రభుత్వంలో విలీనం చేసేంద

ఇంటర్ ఉద్యోగులకు బదిలీలు జరపాలి

- సిఎం కెసిఆర్‌కు టిప్స్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియట్ విద్యలో పనిచేస్తున్న ఉద్యోగులకు సాధారణ బదిలీలు జరిపించాలని "తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్ల అసోసియేషన్ (టిగ్లా), తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి (టిప్స్)" రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా సంఘాల ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. కాలేజీల ప్రిన్సిపళ్లకు టిగ్లా, టిప్స్ నాయకులు వినతిపత్రాలను సమర్పించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు టిప్స్ కన్వీనర్లు మాచర్ల రామకృష్ణగౌడ్, కొప్పిశెట్టి సురేష్, గాదె వెంకన్న, కె నగేష్, ఎండీ రహీమ్ ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రాన్ని పంపించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధ్యాపకులు, ఉద్యోగులకు టిగ్లా రాష్ట్ర అధ్యక్షులు మైలారం జంగయ్య, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

గౌలిదొడ్డిలో గ్లామ్ స్టూడియో ప్రారంభం

హైదరాబాద్ : ప్రముఖ సెలూన్ బ్రాండ్ అయిన గ్లామ్ స్టూడియోస్ బుధవారం హైదరాబాద్‌లోని గౌలిదొడ్డిలో తన కొత్త సెలూన్‌ను ప్రారంభించింది. తమ బ్రాండ్ ఇప్పటికే దేశంలో 250కి పైగా సెలూన్‌లను కలిగి ఉందని పేర్కొంది. రాబోయే మూడు ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా సెలూన్‌లలో అతిపెద్ద బ్రాండ్‌గా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. హైఎండ్, అత్యాధునిక సెలూన్ పరికరాలు, ఫిక్చర్‌లను కలిగి ఉన్న తన సెలూన్, వినియోగదారుల డబ్బుకు ఉత్తమమైన విలువను అందిస్తుందని సెలూన్ ఫ్రాంచైజీ యాజమాని కృష్ణ కిషోర్ పేర్కొన్నారు.

నిజాంపేటలో కుప్పకూలిన భవనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మాణంలో ఉన్న రెండు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్ప కూలింది. బుధవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్ఆర్ఐ కాలనీలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నిర్మాణంలో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ తెలిపింది. ఒకటో స్లాబ్ క్యూరింగ్ సరిగా చేయకపోవడం, వెంటనే రెండో స్లాబ్ వేయడం, బరువు తాళలేక కుప్పకూలిందని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి వర్సెస్ కెటిఆర్

- కొడంగల్‌లో గెలుపే లక్ష్యంగా ప్రయత్నాలు
- ఆ రెండు పార్టీల రాష్ట్ర నాయకత్వాలకు అగ్ని పరీక్షగా విజయం
- రేవంత్‌కి ఉచ్చుబిగించేందుకు బిఆర్ఎస్ వ్యూహం
- కొడంగల్ గెలుపు బాధ్యతలు హరీశ్ నుంచి కెటిఆర్‌కు..!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవడం బిఆర్ఎస్, కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి సవాల్‌గా మారింది. కొడంగల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రేవంత్‌రెడ్డి బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. ఈ ప్రాంతంలో రేవంత్‌ను ఓడించాలన్నదే బిఆర్ఎస్ లక్ష్యంగా పావులు కదుపుతుంది. కొడంగల్‌ను మరోసారి కైవసం చేసుకోవడానికి బిఆర్ఎస్ కెటిఆర్‌ను రంగంలోకి దిగేంచేందుకు రెడీ అయినట్టు ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు. దాంతో కొడంగల్ రాజకీయం కేటీఆర్ వర్సెస్ రేవంత్ అన్న చందంగా ఉత్కంఠ భరితంగా మారింది.

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్ది రాజకీయాల్లో రోజుకో పరిణామం చోటు చేసుకుంటుంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఉచ్చు బిగించేందుకు వ్యూహాలు పన్నుతోంది. సీనియర్ నాయకులు బరిలో నిలిచే నియోజకవర్గాల్లో పాగా వేసేందుకు బిఆర్ఎస్ ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇటీవల కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. కొడంగల్ నియోజవకవర్గం నుంచి టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తప్ప మరో దరఖాస్తు రాలేదు. దాంతో అప్పటి దాకా రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి, ఎల్బీనగర్ ప్రాంతాల నుంచి పోటీ చేస్తారన్న వార్తలకు చెక్ పెట్టినట్టయింది. దీనికి తోడు రేవంత్‌రెడ్డి కచ్చితంగా కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలుస్తానని కార్యకర్తల సమావేశంలో స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలోనూ ఓటు బ్యాంక్‌ను పెంచుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీన్ని గమనించిన బిఆర్ఎస్ రేవంత్‌రెడ్డికి చెక్‌పెట్టడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఓటమిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కెసిఆర్ బిఆర్ఎస్‌కు త్రిబుల్ షూటర్‌గా ఉన్న హరీశ్‌రావును రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. హరీశ్‌రావు తమ రాజకీయ చరిష్మాతో పాటు అంగబలం, అర్థబలం ప్రయోగించి స్వల్ప మెజార్టితో ప్రస్తుత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని గట్టెక్కించారు. అయితే ప్రస్తుతం కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డిని ఓడించే బాధ్యతను కెటిఆర్‌కు అప్పగించనున్నట్టు ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నాయి. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ వేవ్ కొనసాగుతున్న పరిస్థితులను గమనించిన కెటిఆర్ అండర్ గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. మండల స్థాయి కార్యకర్తలకు టచ్‌లోకి వెళ్లి బిఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని సంకేతాలు పంపుతున్నట్టు సమాచారం. రాబోయే కాలంలో కాబోయే సిఎం అన్న మార్కును చాటుకున్న కేటీఆర్‌కు కొడంగల్ గెలుపు అగ్నిపరీక్ష కానుంది.

కొడంగల్ గెలుపు కాంగ్రెస్ జీవన్మరణం

రాష్ట్రంలో కాంగ్రెస్ గట్టెక్కించేందుకు పిసిసి అధ్యక్షుని గెలుపు కాంగ్రెస్‌కు జీవన్మరణం లాంటింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందంటున్న రేవంత్‌రెడ్డికి తమ గెలుపునూ ఒక సవాల్‌గా నిలుస్తోంది. ఆ సవాల్‌ను ఎదుర్కోవడానికి అండర్ గ్రౌండ్ టీమ్‌ను దింపుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే టీమ్ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్టు ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులను పార్టీలోకి చేర్చుకోవడం, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు టచ్‌లోకి వెళ్లి వారిని మచ్చిక చేసుకోవడంలో రేవంత్‌రెడ్డి తీవ్ర కృషి చేస్తున్నారు. ఈ గ్రౌండ్ వర్క్‌లో ఎవరి ప్రయత్నాలు ఫలిస్తాయో.. ఎవరి పంతం నెగ్గుతుందో చూడాలి మరి.

సమ్మెను ఉధృతం చేస్తాం

- అసంతృప్తికరంగా మంత్రి హామీలు
- పోరాడే సంఘాలను పిలవకపోవడం అప్రజాస్వామికం
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మళ్లీ పాత పద్ధతిలోనే అంగన్‌వాడీ ఉద్యోగులను మోసం చేసేలా మంత్రి హామీలున్నాయని, అంగన్వాడీల కీలక సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో సమ్మెను ఉధృతం చేస్తామని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు పి జయలక్ష్మి (సిఐటియు), ఎన్ కరుణకుమారి (ఎఐటియుసి) ప్రకటించారు. సెప్టెంబర్ 11 నుంచి సమ్మె చేస్తున్న, సమస్యలపై పోరాడుతున్న సంఘాలను మంత్రి చర్చలకు పిలవకపోవడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. అసలు పోరాటంలోనే లేని సంఘాలతో చర్చలు జరపడం ఏంటని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అతి ముఖ్యమైన డిమాండ్లు అయిన పర్మినెంట్, కనీస వేతనం, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంపు అంశాలను కనీసం ప్రస్తావించకపోవడం దారుణమని పేర్కొన్నారు. బతికున్నప్పుడు సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్లను పక్కనపెట్టి కేవలం చనిపోయిన తర్వాత దహన సంస్కారాలు నిర్వహించడానికి టీచర్లకు రూ.20 వేలు, ఆయాలకూ రూ.పది వేలు ప్రభుత్వం నిర్ణయం చేయడం దుర్మార్గమని తెలిపారు. చావులోనూ టీచర్లకు, ఆయాలకు అమౌంట్‌లో వ్యత్యాసం చూపించటం సరైంది కాదని పేర్కొన్నారు. రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ అని చెప్పారుగానీ జిఒ మాత్రం రాలేదని తెలిపారు. మినీ వర్కర్ల సర్కులర్‌లో మినీలను మెయిన్ టీచర్స్‌గా నియామకం, హెల్పర్ల నియామకంపైన స్పష్టత లేదని పేర్కొన్నారు. షరతులు అనే అంశం మినీ టీచర్లకు ప్రమాదకరంగా మారబోతుందని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో కొత్తగా చెప్పిందేమీ లేదని పేర్కొన్నారు.

జర్నలిస్టుల రైల్వే పాస్ పునరుద్ధరణకు కృషి

- ఇండ్ల స్థలాల విషయంలోనూ సర్కారు సానుకూలం
- హెచ్‌యుజె ప్రతినిధులతో చేవెళ్ల ఎంపి రంజిత్ రెడ్డి

హైదరాబాద్

జర్నలిస్టు రైల్వే పాసుల పునరుద్ధరణకు తన వంతు కృషి చేస్తానని చేవెళ్ల ఎంపి డాక్టర్ జి.రంజిత్ రెడ్డి అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలోనూ, రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని వెల్లడించారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజె) ప్రతినిధి బృందం ఆయన్ను కలిసి పలు అంశాలను ఎంపి దృష్టికి తీసుకెళ్లారు.కొవిడ్ కాలం నుంచి జర్నలిస్టులకు రాయితీ పాసులను రైల్వేశాఖ ఆపేసిందనీ, ఇప్పటికీ పాస్‌లు పునరుద్ధరించలేదనీ వివరించారు. ఎంపి స్పందిస్తూ, పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పాత్రికేయుల రైల్వే పాసులు పునరుద్ధరించాలంటూ లేఖ కూడా రాస్తానని తెలిపారు. అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ప్రభుత్వం ఇండ్లస్థలాలు ఇస్తుందని,గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులకూ ఇండ్ల స్థలాల విషయంలో సిఎం కెసిఆర్ సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఇటీవల టిటిడి బోర్డు సభ్యులుగా నియమితులైన ఎంపి రంజిత్ రెడ్డి సతీమణి సీతారెడ్డికి హెచ్‌యుజె బృందం శుభాకాంక్షలు తెలిపింది. అందరికీ అందుబాటులో ఉండే సీతారెడ్డికి ఆ పదవి దక్కడంపై బృందం హర్షం వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా సీతారంజిత్ రెడ్డిని హెచ్‌యుజె ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, ట్రెజరర్ బట్టిపాటి రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్లు సాగర్, వనపర్తి, బయ్యా దామోదర్, రమేష్ తదితరులు ఉన్నారు.

రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులు

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం.. నాడు సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లా రంగశాయిపేట ఆ పార్టీ స్థానిక కమిటీ ఆధ్వర్యంలో ఏరియా కమిటీ కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షతన ఆర్‌టిఏ జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాగయ్య మాట్లాడుతూ.. ఆనాడు.. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టులు.. బ్రిటిషర్లు, నిజాం, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేశారని, దాని ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యిందని తెలిపారు. కులమతాలతో సంబంధం లేకుండా భూమి కోసం, విముక్తి కోసం జరిగిన చారిత్రక పోరాట చరిత్రను కూడా ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం బిజెపి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య మాట్లాడుతూ.. బిజెపి దాని అనుబంధ సంఘాలు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి, విభజన రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఢిల్లీలో జరుగుతున్న జీ 20 అంతర్జాతీయ సదస్సులో 'విద్వేషాలు వద్దు' అనే తీర్మానాన్ని ప్రధాని మోడీ ప్రవేశపెట్టి, అమోదించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి, ఏరియా కమిటీ సభ్యులు గణేపాక ఓదెలు, మాలోతు ప్రత్యూష, మన్నూరు జ్యోతి, రత్నం, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షకార్యదర్శులు అనీల్, దుర్గయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చుక్క ప్రశాంత్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రామ సందీప్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కూన రాధిక, కెవిపిఎస్ ఏరియా కార్యదర్శి ఉసిల్ల కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ గజ్జ చందు, శాఖ కార్యదర్శులు, పార్టీ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు పశు మిత్రల మద్దతు : కాసు మాధవి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని పశుమిత్ర పర్యర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసు మాధవి తెలిపారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల పర్మినెంట్, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.పది లక్షలు, ఆయాలకు రూ.ఐదు లక్షలు చెల్లింపు, తదితర డిమాండ్లన్నీ న్యాయసమ్మతమైనవేనని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులపై ప్రభుత్వం సాగిస్తున్న అణచివేత, దమనకాండ వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. ఇది అంగన్‌వాడీ ఉద్యోగులపై దాడి మాత్రమే కాదనీ, ఇది ఉద్యోగ, కార్మికుల హక్కులపై దాడి అని పేర్కొన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిర్బంధాన్ని ఆపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

వాల్ పోస్టరావిష్కరిస్తున్న ఫెడరేషన్ నేతలు

16న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంగ్రామ సభ

- వాల్‌పోస్టరావిష్కరణలో ఫెడరేషన్ నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచడంతో పాటు పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ నెల 16న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంగ్రామ సభను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లో సంగ్రామ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. లక్షా నలభై వేల మందికిపైగా ఉన్న ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, డైలీవేజ్ తదితర సిబ్బందిని దశల వారీగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటిలోగా సమాన పనికి - సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తానన్న ముఖ్యమంత్రి వాగ్దానాన్ని పక్కనపెట్టి అవుట్‌సోర్సింగ్ వ్యవస్థను శాశ్వతం చేసే దిశగా ముందుకెళ్తున్నారని విమర్శించారు. విజ్ఞాపనలు, ఆత్మీయ సమ్మేళనాలతో ఈ ప్రభుత్వం దిగిరాదని తేలిపోయిందన్నారు. 16న జరిగే సంగ్రామ సభలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు సంబంధించి 33 జిల్లాల్లో 44 రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. శాఖలు, హోదాలు, ఇతర అనుబంధాలకతీతంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంఘటితంగా ప్రభుత్వంపై పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జె వెంకటేశ్‌తో పాటు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జె కృష్ణారెడ్డి, జె కుమారస్వామి, మహేందర్‌లు పాల్గొన్నారు.

యజ్ఞతుల్యంగా బహు భాషా నాటికోత్సవాలు

ప్రజాశక్తి - కల్చరల్

గత పదహారు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో బహుభాష నాటికల ప్రదర్శన యజ్ఞ తుల్యంగా నిర్వహిస్తున్న అభినయ శ్రీనివాస్ నాటక వ్యాప్తికి విశేష కృషి చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ ప్రశంసించారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ సౌజన్యంతో అభినయ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ నాటికల ప్రదర్శన ముగింపు వేడుక జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొనగా హిందీ నటులు చంద్ర కాంత ఖానపుర్కర్, బూప్పన నరసింహారావు జి వరప్రసాద్, క్రోసూరి సుబ్బారావు పాల్గొనగా అభినయ శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్ ముగింపు రోజు నాట్ ఘర్ మజులి అస్సాం రాష్ట్రానికి చెందిన లక్ష్మీ నాథ్ బజ్ బారువా రచించిన జోయోతి అస్సామీ నాటిక ను భాస్కర్ జ్యోతి దర్శకత్వంలో ప్రదర్శించారు. మధ్య యుగ అస్సాం చరిత్ర ఆధారంగా ఆహోమ్ రాజ వంశ వాస్తవ కథ. జోయోమతి నేటి అణచివేత, దుష్టపాలన, అవినీతికి వ్యతిరేకంగా పోరాడి తన భర్త రాజును కూడా దిక్కరించి ప్రాణ త్యాగం చేసింది. ఈ వాస్తవ కథను నాటిక రూపంలో చెప్పారు. మరో నాటిక ఫౌండేషన్ హైదరాబాద్ వారిచే నితిన్ బద్రుర్ రచించిన తోహ్ స్వప్న పక్షి మరాఠీ నాటికను దేష్ పాండే దర్శకత్వంలో ప్రదర్శించారు. సమాజంలో వృద్ధుల పట్ల కన్న బిడ్డలు చూపే నిరాదరణ ఈ నాటిక కథాంశం.

విచ్చలవిడిగా తెలంగాణ ఫార్మసీ

ఎన్నికల నామినేషన్ ఫారమ్స్..!

- రిటర్నింగ్ అధికారి సంతకం లేకండానే అందజేత
- ఎవరికి పడితే వారికి.. ఎన్ని అంటే అన్ని పంపిణీ
- ఫార్మసీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ వివాదాలకు కేరాఫ్‌గా మారుతోంది. పది రోజుల కిందటి వరకు రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు చేతివాటం ప్రదర్శించిన కొందరు కౌన్సిల్ ఉద్యోగులు.. ఇప్పుడు కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ పత్రాలను విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్నారు. ఇలాంటి చర్యలు కౌన్సిల్ ఎన్నికలపై ఎఫెక్ట్ పడే ఛాన్స్ ఉంటుంది.

త్వరలో తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ కౌన్సిల్‌లో దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 55 వేల మంది ఫార్మసిస్టులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉన్నారు. వీరంతా ఈ ఎన్నికల్లో వారి ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడింది. ఈ నెల 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నామినేషన్ ఫారాలను జారీ చేశారు. కౌన్సిల్‌లో పని చేసే కొందరు ఉద్యోగులు ఒక్కో ఫార్మసిస్టుకు ఎన్ని ఫారాలు అడిగితే అన్ని ఇచ్చేస్తున్నారు. ఫారాలు అందజేసే సమయంలో వారు ఫార్మసిస్టులా..? కారా..? వారి రిజిస్ట్రేషన్, రెన్యువల్ అప్‌డేట్ అయ్యి ఉందా..? లేదా..? రిజిస్ట్రేషన్ నెంబర్ ఎంత..? అనే వివరాలు, రిజిస్ట్రేషన్ నెంబర్‌తో ఫారం నింపి అందజేస్తాడు. అపోనెంట్ క్యాండిడెట్ మధు పేరు మీద ఫారం తీసుకుని నింపి అందజేసే అకాశం లేకపోలేదు. ఇలా చేస్తే స్క్రూట్నీ సమయంలో ఇద్దరి ఫారాలు రిజెక్ట్ అవుతాయి. దీని వల్ల ఒరిజినల్ ఫార్మసిస్టుకు అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. స్క్రూట్నీలో తిరస్కరణకు అవకాశమూ ఉంటుంది. నామినేషన్ ఫారంను ఎవరైనా తప్పుగా నింపినా, లేక ఏదైనా లెటర్ కానీ, పేరు కానీ సరిగా నమోదు చేయకపోయినా రిటర్నింగ్ అధికారి సంతకం లేకపోవడంతో కౌన్సిల్‌లో పని చేసే ఉద్యోగుల సహాయంతో మరో ఫారం నింపి ఇచ్చే అవకాశం ఉంటుంది. రిటర్నింగ్ అధికారి సంతకం లేకపోవడం, ఫారం మీద నెంబర్ మెనిషన్ లేకపోవడం వల్ల డూబ్లికేట్‌గాళ్లు, అపోనెంట్ క్యాండిడెట్స్ మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడే ప్రమాదమూ ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఫార్మసిస్టులు కోరుతున్నారు.

నిబంధనలు పాటిస్తున్నాం

ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నాం. ఫారం సబ్‌మిట్ చేసిన తర్వాత పరిశీలన చేసి నెంబర్ వేస్తున్నాం. స్క్రూట్నీ మా పరిధిలో ఉండదు. సికింద్రాబాద్‌లోని ఆయుష్ కార్యాలయంలో జరుగుతుంది. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆ వ్యవహారాన్ని చూసుకుంటారు. నామినేషన్ల స్వీకరణ వరకు మాత్రమే కౌన్సిల్‌కు సంబంధం.

బి.యోగానందం, రిజిస్టార్, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్

హైదరాబాద్‌లో క్వాంటమ్ సేవలు

- ఆ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో క్వాంటమ్ సేవలు అందుబాటులోకి రావడం మంచి పరిణామం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, కొత్త సాంకేతికల నేపథ్యంలో మానసిక ఒతిళ్లను తగ్గించుకోవడానికీ, నయం చేసుకోవడానికీ క్వాంటమ్ ఉత్పత్తుల అవసరం ఎంతో ఉందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో క్వాంటమ్ సంస్థ కార్యాలయాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆ సంస్థ హెడ్ క్వార్టర్ అమెరికాలోని నూజెర్సీలో ఉందన్నారు. క్వాంటమ్ హైదరాబాద్‌కు రావడంతో ప్రపంచస్థాయి సేవలన్నీ ఇక్కడ అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్వాంటమ్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఒద్దిరాజు రవిచంద్ర, సినీ నిర్మాత దిల్ రాజు, నిర్వాహకులు నరేందర్, సంజయ్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గుడిసెలు దక్కేవరకూ పోరు

- ప్రజాసంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

పేదలకు గుడిసెలు దక్కేవరకూ పోరాడాలని గుడిసెవాసులకు ప్రజాసంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య కోరారు. ములుగు జిల్లా వాజేడు మండలం పూసురు రెవెన్యూ గ్రామంలో మూడు రోజులుగా గుడిసెవాసులు చేపట్టిన పోరాటాన్ని బుధవారం వీరయ్య సందర్శించి మాట్లాడారు. పేదల ఇంటి స్థలాలకు స్థలం లేదంటున్న ప్రభుత్వం.. కార్పొరేట్ శక్తులకు ఉచితంగా ఇవ్వడానికి మాత్రం స్థలం ఉందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 కేంద్రాల్లో భూపోరాటం జరుగుతుందన్నారు. వేలాది మంది గుడిసెవాసులు ఎర్రజెండా అండతో పోరాడాలని, వారికి అండగా ఉంటామని స్పష్టంచేశారు. పేదల బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నా.. గుడిసెలకు ఇంటి జాగా అడిగితే రెవెన్యూ అధికారులు.. పోలీసుల